అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 30 జూన్ 2023

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఐకేరెడ్డి



నిర్మల్ : బక్రీద్ సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఈద్గా వద్ద గురువారం ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ త్యాగానికి, నమ్మకానికి, భక్తి భావానికి ప్రతీక అని తెలిపారు. బక్రీద్ పండుగ సమాజంలో ప్రజల మధ్య దయ, సామరస్యాలను పెంపొందిస్తుందన్నారు. ఈ పండుగను ముస్లిం సోదరులందరూ ఉత్సాహంగా జరుపుకోవాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ గంధ్రత్ ఈశ్వర్, మాజీ డిసిసిబి చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

బీసీలకు పోడు పట్టాలిచ్చి, రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీలకు పోడు పట్టాలు ఇవ్వాలని, రైతు రుణమాఫీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో బంజారా, ఆదివాసి, గిరిజనులకు పోడు భూములకు పట్టాలిచ్చి రైతుబంధు పథకాన్ని అమలు చేయడం అభినందనీయమని, జిల్లాలో బీసీ రైతులు కూడా ఎన్నో సంవత్సరంల నుండి పోడు భూములు దున్నుకుంటూ వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. కానీ ఇప్పటివరకు వాళ్లకు ఎటువంటి పట్టాలు లేవన్నారు. చాలా మంది ఇలాంటి భూములపై ఆధారపడి జీవనం గడుపుతున్నారన్నారు. కొన్ని సందర్భాలలో అధికారులు బీసీ రైతుల భూములను సర్వే చేస్తున్నా నిర్ణయం చెప్పకపోవడంతో ఏం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రుణమాఫీ చేయాలని, బీసీలకు పోడు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

గణాంకాల కచ్చితత్వంలో మండల అధికారుల పాత్ర కీలకం

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

గ్రామ స్థాయి నుండి గణాంకాలు కచ్చితంగా రూపొందించడంలో మండల గణాంకాధికారుల పాత్ర కీలకమైందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ప్రొఫెసర్ ప్రశాంత్ చంద్ర మహల నోబిస్ 130వ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ గణాంక దినోత్సవం పురస్కరించుకుని గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2021-22 జిల్లా గణాంక దర్శిని(హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్)ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, ముఖ్య ప్రణాళిక అధికారి జి.సత్యంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి కచ్చితమైన గణాంకాలు రూపొందించి జిల్లా అధికారులకు అందించడంలో మండల గణాంక అధికారుల పాత్ర కీలకమైనదని అన్నారు. జిల్లా గణాంక దర్శిని పుస్తకం జిల్లా ఆర్థిక స్థితిగతులను తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ గణాంక అధికారులు, మండల ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులను మోసం చేస్తున్న కేసీఆర్



నవతెలంగాణ-ఖానాపూర్

పోడు భూముల పంపిణీలో గిరిజనులను ముఖ్యమంత్రి కేసీఆర్ అడుగడుగునా మోసం చేస్తున్నారని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బానోత్ గోవింద్‌నాయక్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజనులకు పోడు భూములను అరకొరగా పంపిణీ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోడు భూముల కోసం 4లక్షలకు పైగా గిరిజనులు దరఖాస్తు చేసుకుంటే కేవలం 1.5లక్షల మందికి పట్టాలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం గిరిజనులను మోసం చేయడమేనని తెలిపారు. పోడు పట్టాల కోసం గిరిజనులు రాష్ట్ర మంత్రులను, ఎమ్మెల్యేలను, ముఖ్యమంత్రిని కూడా నిలదీయాలన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హరితహారం పేరుతో భూములు గుంజుకుంటోందని, గిరిజనులపై దాడులు చేస్తోందని పేర్కొన్నారు. గిరిజన చట్టాలైన 1/70, పెసా అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో పట్టాల పంపిణీ పేరిట కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. లంబాడి హక్కుల పోరాట సమితి రథసారథి డాక్టర్ బెల్లయ్య నాయక్ సారథ్యంలో జులై 1న సిల్వర్ జూబ్లీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా గిరిజన హక్కులు, హామీల సాధన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై దశల వారీ ఉద్యమాలకు సిద్ధమవుతామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ అశోక్, సూర్యకాంత్ కామ్లే, రాథోడ్ రోహిదాస్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ క్విజ్ రిజిస్ట్రేషన్



నవతెలంగాణ-కాసిపేట

కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకొని యువతను ప్రోత్సహించడానికి యువతలో ఉన్న ప్రతిభను బయటకు తీయడానికి చేపడుతున్న రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కార్యక్రమాన్ని గురువారం మండలంలోని యాపలో మండల యూత్ కాంగ్రెస్ ఇంచార్జి కనుకుల రాకేష్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన 100 మంది యువతకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ మాట్లాడుతూ ఈ క్విజ్ కాంపిటీషన్‌తో విద్యార్థుల ప్రతిభతో పాటు వాళ్లకు ఉపయోగపడే విధంగా స్కూటీ, మొబైల్, ట్యాబుతో పాటు 40 ప్రైజ్‌లు కూడా ఉన్నాయన్నారు. యువత అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, 7661899899 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా లింక్ వస్తుందని అన్నారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముడిమడుగుల మహేందర్ మాట్లాడుతూ ఈ ఆన్‌లైన్ క్విజ్‌ను యువత అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో అక్రమాలు చేస్తోందని, కాళేశ్వరం, మిషన్ భగీరథ పేరు మీద లక్షల కోట్లు వెనకేసుకున్నారని, నియోజకవర్గ ఎమ్మెల్యే అయితే పొద్దున లేస్తే కొబ్బరికాయ కొట్టడం తప్ప పనులు మాత్రం చేయడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సిద్ధం తిరుపతి, ఎంపిటిసిలు భీంరావు, మెరుగు శంకర్, నాయకులు కన్నాక రాజు, మహంకాళి, చారి, వెంకటేష్, ప్రభావత్‌రావు, చిలుకయ్య, కొత్త రమేష్, పంబల తిరుపతి, బన్న శ్రీను, ఎన్ఎస్‌యూఐ నాయకులు విద్యాసాగర్, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రేమ్‌కుమార్, వెంకటేష్, నండికొండ శ్రీధర్, సాయి పున్నం, మధు, ప్రదీప్, నవీన్, బానోత్ రవి, జంజీరాల రాజు, అక్కపెల్లి సాయి, మరనేని వంశీ, ప్రణయ్ పాల్గొన్నారు.

ఆశలు ఫలించేనా..భరోసా దక్కేనా..?

- కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో వేధిస్తున్న పలు సమస్యలు
- అసంపూర్తిగా మిగిలిన సాగునీటి ప్రాజెక్టులు
- నేడు ఆసిఫాబాద్‌కు సీఎం కేసీఆర్ రాక
- పోడు భూములకు పట్టాలు..పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ఆదివాసుల జిల్లాగా..మన్యం వీరుడు కుమురంభీం పుట్టిన గడ్డగా పేరుగాంచిన కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో అనేక సమస్యలు వేధిస్తున్నాయి. ఏండ్లుగా పరిష్కారానికి నోచుకోక గిరిజన, గిరిజనేతరులు అవస్థలు పడుతున్నారు. నూతన జిల్లాగా ఆవిర్భవించడంతో పరిపాలన పరంగా జిల్లావాసులకు సౌకర్యవంతంగా మారినా..మౌలిక వసతుల కొరత మాత్రం తీరడం లేదు. మరోపక్క ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు యధావిధిగానే ఉంటున్నాయి. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ఉన్నా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ప్రాజెక్టులు నిర్మించిన ప్రభుత్వాలు కాలువలు నిర్మించడం విస్మరించాయి. ఫలితంగా వ్యవసాయ సాగుకు ఏ మాత్రం ప్రయోజనం చేకూర్చడం లేదు. జిల్లాలో 15 ఎత్తిపోతల పథకాలు ఉన్నా..వృథాగా ఉండిపోయాయి. వీటితో పాటు అటవీ అనుమతులు లభించక గ్రామాల మధ్య అనుసంధాన రోడ్ల నిర్మాణం, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడం మూలంగా రైతులు సాగునీటికి నోచుకోవడం లేదు. తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని జిల్లావాసులు కోరుతున్నారు.



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మంత్రి ఐకేరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మన్యం వీరుడు పుట్టిన గడ్డ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా. రాష్ట్రంలోనే చరిత్ర కలిగిన ఈ జిల్లాలో ఆదివాసీ గిరిజనుల జనాభానే అధికంగా ఉంది. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం నూతన జిల్లాగా ఏర్పడిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోయాయి. ఏండ్ల క్రితం నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు నిష్ప్రయోజనంగా మారాయి. కుమురంభీం పేరుతో నిర్మించిన అడ ప్రాజెక్టు 2005లో పనులు ప్రారంభించారు. పనులు పూర్తయి పదేండ్లు గడిచినా ఇప్పటికీ కాలువల నిర్మాణం చేపట్టడం లేదు. ఏటా ప్రాజెక్టు నీటితో నిండుకుండను తలపిస్తున్నా ప్రధాన కాలువలు అసంపూర్తిగానే ఉండటంతోనే వ్యవసాయానికి చుక్కనీరు పారడం లేదు. 2004లో కాగజ్‌నగర్ మండలం పెద్దవాగుపై నిర్మించిన జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు అసంపూర్తిగానే ఉండిపోయింది. గేట్లు అమర్చలేదు. 70శాతం ప్రాజెక్టు పని పూర్తయినా..30శాతం పనులు అలాగే ఉండిపోయాయి. దీంతో నిర్మించినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఇక పీపీరావు, వట్టివాగు ప్రాజెక్టులకు మరమ్మతులు లేకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరందడం లేదు. జిల్లాలో సుమారు 15వరకు ఎత్తిపోతల పథకాలు నిర్మించినా ఒక్కటీ పనిచేయడం లేదు. ప్రాణహిత చేవెళ్ల స్థానంలో వార్ధానదిపై బ్యారేజీ నిర్మిస్తామని ఇటీవల ముఖ్యమంత్రి హామీనిచ్చారు. కానీ దీనికి సంబంధించి డీపీఆర్ తయారుకావడం లేదు. బెజ్జూరు మండలం తలాయి వద్ద జల విద్యుత్ కేంద్రం ఏర్పాటుచేస్తామని గతంలో హామీనిచ్చినా నేటికీ కార్యరూపం దాల్చడం లేదు. వీటితో పాటు ప్రస్తుతం ఆస్పత్రులు ఆధునాతనంగా నిర్మిస్తున్నా వైద్యుల లేమితో జనానికి మెరుగైన వైద్య లభించడం లేదు. కిందటేడాది గురుకులాల్లో వసతుల లేమి కారణంగా అనేక మంది విద్యార్థులు అవస్థలు పడ్డారు. కొందరు విద్యార్థులు చనిపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రహదారుల దుస్థితి అధ్వాన్నంగా ఉంది. డబుల్ రోడ్ నిర్మాణంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇక అటవీ అనుమతులు లభించక అనేక గ్రామాలకు అనుసంధాన రోడ్ల నిర్మాణం నిలిచిపోయింది. దీంతో దారి లేక గిరి ప్రజలు అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ముఖ్యమంత్రి ఆయా సమస్యలపై దృష్టిసారించి పరిష్కారానికి భరోసా ఇవ్వాలని జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు.

నెరవేరనున్న పోడు పట్టాల కల..!

ఉమ్మడి జిల్లా గిరిజనులు పోడు భూములకు పట్టాలు అందించాలని అనేక ఏండ్ల నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అనేక ఆందోళనలు, నిరసనలు చోటుచేసుకున్నాయి. అటవీ అధికారులు, పోడు సాగుదారుల మధ్య నిత్యం ఘర్షణ వాతావరణం కనిపించేది. ఇరువురి ఘర్షణలో పలు పోలీసు కేసులు కూడా నమోదైన సందర్భాలున్నాయి. అర్హులైన గిరిజనులకు పోడు పట్టాలు అందించాలని పలు ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. సీపీఐ(ఎం) అనేక ఉద్యమాలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని సీపీఎం పలుమార్లు ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లింది. దీంతో సీఎం కేసీఆర్ పోడు భూములకు పట్టాలు జారీ చేస్తామని కిందటేడాది ప్రకటించారు. ఇందుకు అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. తాజాగా ఉమ్మడి జిల్లాలో 37,401మందికి గాను 1,03,896 ఎకరాలకు హక్కుపత్రాలు జారీ చేసేందుకు రంగం సిద్ధంచేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 31,683 ఎకరాలకు గాను 12,222మందికి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 47,138 ఎకరాలకు 15,519మందికి, నిర్మల్ జిల్లాలో 20,051ఎకరాలకు 7257మందికి, మంచిర్యాల జిల్లాలో 5024 ఎకరాలకు గాను 2403మందికి హక్కుపత్రాలు జారీ చేయనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా గిరిజనుల అనేక ఏండ్ల నిరీక్షణకు నేటితో తెరపడటంతో వారిలో ఆనందం వెల్లువిరిస్తోంది. ప్రభుత్వపరంగా పట్టాదారులకు దక్కాల్సిన ప్రయోజనాలన్నీ వీరికి కూడా లభించనున్నాయి. మరోపక్క జిల్లాలో అనేక మంది గిరిజనేతరులు కూడా పోడు పట్టాల కోసం దరఖాస్తులు చేసినా ప్రభుత్వం తాజాగా వీరిని పరిగణనలోకి తీసుకోకపోవడంతో వారిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఇది

నవతెలంగాణ- ఆసిఫాబాద్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. శుక్రవారం ఉదయం 11గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో బయలుదేరనున్న ఆయన మధ్యాహ్నం 12గంటలకు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. 12.15గంటలకు స్థానిక చౌక్‌లో కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. 12.35గంటలకు జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. 1.10గంటలకు చిల్డ్రెన్ పార్కు ప్రారంభించి మాజీ మంత్రి కొట్నాక్ భీంరావు విగ్రహానికి నివాళులర్పించనున్నారు. 1.50గంటలకు జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. 2గంటలకు సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభిస్తారు. భోజన విరామం తర్వాత అక్కడే లబ్ధిదారులకు పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయనున్నారు. సాయంత్రం 4గంటలకు స్థానిక ప్రేమల గార్డెన్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 5గంటల వరకు ఇక్కడే ఉండి.. అనంతరం హెలికాప్టర్‌లో హైదరాబాద్ బయలుదేరి వెళ్లనున్నారు. సీఎం సభకు సంబంధించి ఏర్పాట్లను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు పరిశీలించారు.



అడ ప్రాజెక్టు(ఫైల్)



సిద్ధమవుతున్న బహిరంగ సభాస్థలి

సర్వం జగన్నాథం

- ప్రశ్నార్థకంగా జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు
- 17 ఏండ్లైనా నిర్మాణ దశలోనే..
- రైతులకు కరువైన సాగునీటి భరోసా
- నేడు సీఎం నోట ప్రాజెక్టుపై స్పష్టత వచ్చేనా?

బీడు భూములకు సాగు నీరందించాలనే ఆశయంతో ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 17 ఏండ్ల కిందట చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టు నేటికీ నిర్మాణ దశ వీడడం లేదు. ముంపు భూములకు పరిహారం అందకపోవడం, చేసిన పనులకు సకాలంలో కాంట్రాక్టర్‌కు బిల్లులు అందకపోవడంతో ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. రెండేళ్లలో పూర్తి కావాల్సిన కాగజ్‌నగర్ మండలంలోని జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు 17ఏళ్లు గడిచినా నిర్మాణ దశ వీడడం లేదు. అసంపూర్తి దశలోనే ఈ ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రాజెక్టు పూర్తి కావడం ప్రశ్నార్థకంగా మారింది.



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

అప్పట్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలే అధికారంలో ఉండగా 30 శాతం నిధులు కేంద్రమే భరిస్తూ ఆ మేరకు నిధులిచ్చింది. అయినా పనులు పూర్తికాకపోవడం, చేసినవి సైతం శిథిలావస్థకు చేరడంతో అప్పట్లో ఇచ్చిన సొమ్మును తిరిగి ఎందుకు వసూలు చేయరాదో చెప్పాలంటూ కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కొన్ని నెలల కిందట తెలంగాణ నీటిపారుదల శాఖకు లేక రాసింది. వెనుకబడిన ప్రాంతంలో 15వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించాల్సిన మధ్య తరహా ప్రాజెక్టు పెద్దవాగు జగన్నాథపూర్ దుస్థితి ఇది. నిర్మాణం పూర్తి చేయాల్సిన గడువు ముగిసి 17 ఏళ్లు దాటిపోయాయి. అంచనా వ్యయం రూ.124.64 కోట్ల నుంచి రూ.244.66 కోట్లకు పెరిగింది. కానీ ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. ఒక్క ఎకరాకూ నీరందించలేదు.

పూర్తయిన పనులు ఇవే..

మండలంలోని జగన్నాథ్‌పూర్ వద్ద పెద్దవాగు ప్రాజెక్టును 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జలయజ్ఞం కార్యక్రమాల్లో భాగంగా చేపట్టింది. వెనుకబడన ప్రాంతం కావడంతో సత్వర సాగునీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ) కింద కేంద్రం రూ.108 కోట్లు ఇచ్చింది. రూ.124.64 కోట్లతో పరిపాలన అనుమతి ఇవ్వగా గ్యామన్ ఇండియా కంపెనీ రూ.118.90 కోట్లకు ఈ పనిని దక్కించుకుంది. 2005 మార్చి 23న ఒప్పందం జరిగింది. దీని ప్రకారం 720 మీటర్ల మట్టికట్ట, 350 మీటర్ల 18 గేట్లతో కూడిన బ్యారేజీని నిర్మించడంతో పాటు 20కిలోమీటర్ల దూరం కాలువ తవ్వాలి. ఇందులో మట్టి కాల్వ పూర్తి కాగా సిమెంట్ లైనింగ్ 9కిలోమీటర్లు పూర్తి చేసి ఆపేశారు. 108 ఎకరాల కాల్వ ముంపు భూములకు పరిహారం నేటికీ చెల్లించకపోవడంతో రైతులు పనులను అడ్డుకున్నారు. ప్రాజెక్టుపై ప్రభుత్వ పట్టింపు కరువైంది. 88 శాతం పనులు పూర్తయినప్పటికీ కాగజ్‌నగర్ నుంచి దహెగాం వరకు ప్రధాన కాల్వ నిర్మాణ పనులు, డిస్ట్రిబ్యూషన్ కాల్వల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. పలుచోట్ల కాల్వ నిర్మాణంలో భూనిర్వాసితులకు పరిహారం చెల్లింపులు జరగకపోవడంతో కాల్వ నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు చేపడుతున్న కాంట్రాక్టు కంపెనీ మూడేళ్ల కిందటే తన కార్యాలయాన్ని సైతం మూసేసింది. సుమారు రూ.12 కోట్ల బిల్లులు రావాల్సి ఉండగా ప్రభుత్వ చర్యలు కానరాకపోవడంతో చేసేదిలేక కాంట్రాక్టర్ చేతులెత్తేసినట్టు తెలుస్తోంది.



జీపీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- సమ్మె సన్నాహక సదస్సులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్
- జులై 6 నుండి సమ్మె



నవతెలంగాణ-నార్నూర్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సిఐటియు జిల్లా కార్యదర్శి అన్నమొల కిరణ్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని కొమురం భీం భవనంలో పంచాయతీ కార్మికులతో సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సమస్యలు పరిష్కరించాలని కార్మికులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి నిత్యం కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం మెమో నెం.48ని తీసుకొచ్చి పాఠశాలలను, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు పని భారం మోపిందని పేర్కొన్నారు. కార్మికులకు రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ ఇస్తామని సీఎం హామీనిచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. వచ్చే వేతనాలు కుటుంబ పోషణకు సరిపోక కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామపంచాయతీ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పిఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు చెల్లించాలని, 60 సంవత్సరాలు నిండిన వారికి రూ.5లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలను కలుపుకొని జూలై 6వ తేదీ నుండి గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తారని తెలిపారు. ఈ లోపు రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపి కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు బి శ్రీనివాస్, బొజ్జ ఆశన్న, జీపీ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శిలు సోనేరావు, వెంకట్రావు, మండల గౌరవ అధ్యక్షులు బానయ్య, కార్యదర్శి బాపురావు, కొద్దు, జాదవ్ జ్ఞానేశ్వర్, మండల నాయకులు అమృత్, దినేష్, సంతోష్ పాల్గొన్నారు.

'ఎస్టీ హోదా జీఓ కోసం ఎదురుచూస్తున్నాం'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం కేసీఆర్ ఈ నెల 30న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి రానున్న సందర్భంగా ఎన్నో ఏండ్లుగా పోరాటాలు చేసి ఎస్టీ హోదా జీఓ కోసం మాలీ కులస్తులు ఎదురుచూస్తున్నారని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేరే సీఎం ఎవరు చేయని సాహసం సీఎం కేసీఆర్ చేసి, మాలీలకు ఎస్టీ హోదా కోసం అసెంబ్లీలో తీర్మానం చేశారని తెలిపారు. సీఎం ఇంకో అడుగు ముందుకు వేసి రాష్ట్రంలో అమలవుతున్న 10శాతం గిరిజన రిజర్వేషన్లలో మాలీలకు చోటు కల్పిస్తూ జీఓ విడుదల చేసి ఎస్టీ హోదా కల్పిస్తున్నట్లు అత్యధిక మాలీ కులస్తుల జనాభా కలిగిన ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల ముందే మాలీలకు ఎస్టీ హోదా కల్పించి సామాజిక న్యాయం అందించాలని కోరారు.

కొనసాగుతున్న దివ్యాంగుల దీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో దివ్యాంగులు చేపడుతున్న రిలే దీక్షలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. గురువారం నాటికి 145 రోజులకు చేరుకున్నాయి. బక్రీద్ పండుగ నేపథ్యంలోనూ దివ్యాంగులు జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో తమ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నో రోజుల నుండి వినూత్నరీతిలో తమ ఆవేదన తెలియజేస్తున్నా ప్రభుత్వంగానీ, అధికారులుగానీ మొర ఆలకించడంలేదని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ఎండి. ఇమ్రాన్ అన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. అప్పటి వరకు తమ పోరాటం ఆపబోమంటూ స్పష్టం చేశారు.

ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు


అదిలాబాద్‌టౌన్


కడెం


నార్నూర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ వేడుకలను ముస్లింలు ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేకువ జామునే నిద్రలేచి కొత్త దుస్తులు ధరించి, ప్రార్థనల కోసం బయలుదేరి వెళ్లారు. దీంతో ఈద్గా, మసీదుల వద్ద కోలాహలం నెలకొంది. నమాజ్ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు నాగల్‌కొండ, ఇలియాస్‌నగర్, తాడిహత్నూర్ గ్రామాల్లో ముస్లింలు గురువారం బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఈద్గా మసీద్‌లో ముస్లింలు ప్రార్థనలు చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలిపారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముధోల్‌తో పాటు మండలంలోని తరోడా, ఎడ్‌బిడ్, మచ్కల్, తదితర గ్రామాల్లో గురువారం ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముధోల్ సీఐ వినోద్ నేతృత్వంలో ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

బాసర : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. శారదనగర్‌లోని బడా మసీదు వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బక్రీద్ పండుగ ప్రత్యేకతను తెలుపుతూ ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ఇంద్రవెల్లి : త్యాగానికి ప్రతీకగా ముస్లింలు నిర్వహించుకొనే బక్రీద్ పండుగను గురువారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని ముత్నూర్, శంకర్‌గూడ, దనోర(బి), కేస్లాగూడ తదితర గ్రామాల్లో ముస్లింలు కొత్త బట్టలను ధరించి పవిత్ర ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమ ఆప్త మిత్రులకు, బంధువులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

కడెం : మండల కేంద్రంలోని ముస్లింలు గురువారం బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లిం మైనారిటీలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మైనార్టీ మత పెద్దలు మైనారిటీలకు ప్రవచనాలను బోధించారు. అనంతరం ఒకరికొకరు అలైబలై తీసుకుంటూ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా మండల కేంద్రంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

సిరికొండ : మండల కేంద్రంలో గురువారం బక్రీద్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లింలు ఉదయం మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.


అదిలాబాద్‌టౌన్


అదిలాబాద్‌టౌన్

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఉత్తర్ ప్రదేశ్‌లోని దేవ్‌బంద్ గ్రామంలో భీమ్ ఆర్మీ చీఫ్ చంద్ర శేఖర్ ఆజాద్‌పై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తుపాకీతో కాల్పులు జరపడం హేయమైన చర్య అని అన్నారు..దానికి నిరసనగా గురువారం స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద మండల భీమ్ ఆర్మీ నియోజక వర్గ ఇన్‌చార్జీ పరత్‌వాగ్ దత్త, డా.బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ మండల అధ్యక్షులు సోన్ కాంబ్లే మనోహర్ ఆధ్వర్యంలో నోటికి నల్లగుడ్డ కట్టి నిరసనను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు మతోన్మాద శక్తుల వారు భీమ్ ఆర్మీ చీఫ్ కారుపై తుపాకీతో కాల్పులు జరిపారన్నారు. ప్రభుత్వం దుండగులను వెంటనే పట్టుకోని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనకు జడ్ ప్లస్ కేటగిరీ భద్రతను కల్పించాలని అన్నారు. ఆయన ప్రాణానికి ఎలాంటి హానీ కలిగిన ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామరాజ్, ఉత్తం, బాబా సాహెబ్, రాజేందర్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : ఉత్తరప్రదేశ్‌లోని దేవ్‌బంద్‌లో భీమ్ ఆర్మీ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌పై దాడి చేసిన దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని, భీమ్ ఆర్మీ రాష్ట్ర నాయకుడు భరత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రెస్‌భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ పై కొందరు కారులో వచ్చి దాడులు చేశారని, ఈ దాడుల్లో ఆయన గాయపడ్డారని అన్నారు. మతోన్మాద శక్తులు జరిపిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో భీమ్ ఆర్మీ యువజన సంఘం జిల్లా నాయకులు బాబాసాహెబ్ కరీం, శుభం, అతిస్, ధనరాజ్ ఉన్నారు.



ఘనంగా మారెమ్మ ఆలయ 26వ వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రసిద్ధ మారెమ్మ తల్లి ఆలయ 26వ వార్షికోత్సవ వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా చేపట్టారు. స్థానిక శివాజీచౌక్‌లోని మారెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించడం జరుగుతోంది. అందులో భాగంగానే ఆలయ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవోపేతంగా చేపట్టగా, ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాలనీ మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆరాధించారు. ముందుగా డప్పు చప్పుల్ల నడుమ మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని శోభయాత్రగా ఆలయానికి తరలివచ్చారు. భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులతో శివాజీ చౌక్ ప్రాంగణం సందడిగా మారింది. మహిళలు మంగళ హారతులతో శోభయాత్రలో పాల్గొనగా పోతరాజు విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సైతం బోనాలు నెత్తిన పెట్టుకుని శోభయాత్రలో పాల్గొన్నారు. శోభాయాత్ర అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి, పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ మారెమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటి అధ్వర్యంలో పూర్తి ఏర్పాట్లు చేపట్టడం పట్ల అభినందనలు తెలియచేశారు. అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా పాడి పంటలతో, సుభిక్షంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, ఆలయ కమిటి అధ్యక్షులు బాదన్ గంగన్న, పట్టణ అధ్యక్షులు అజయ్, కౌన్సిలర్ ప్రకాష్, దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, బండారి దేవన్న, బాదం గంగన్న పాల్గొన్నారు.

గిరిజన మహిళను హత్య చేసిన నిందితుల అరెస్ట్

- డీఎస్పీ నాగేందర్



నవతెలంగాణ-ఉట్నూర్

భిక్షాటన చేసి బస్ షెల్టర్‌లో ఉన్న గిరిజన మహిళను హత్యాచారం చేసి, హత్యకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. ఇంద్రవెల్లి మండలంలోని దనోర(బి) గ్రామంలో గిరిజన మహిళ ఈ నెల 20న భిక్షాటన చేసి రోడ్డు పక్కన ఉన్న బస్‌షెల్టర్‌కి వెళ్లింది. దనోర(బి) గ్రామానికి చెందిన సుముక్ రావ్ సంతోష్, పసారే సంతోష్, షేక్ ఖదీర్ ముగ్గురు కూడా గిరిజన మహిళను హత్యాచారం చేశారు. ఈ విషయం గ్రామస్తులకు ఎక్కడ చెప్పుతుందోనని హత్య చేసి గ్రామానికి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో పడేశారు. ఈ ఘటన జరిగి నాలుగు రోజుల తర్వాత అటుగా వెళ్లిన గ్రామస్తులు మృతదేహం ఉందని అందరికి తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బృందాలుగా ఏర్పడి, నార్నూర్ సీఐ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి ఎస్సై సునీల్‌తో పాటుగా 4 బృందాలుగా ఏర్పడి విచారించడంతో గ్రామానికి చెందిన వ్యక్తులే హత్యచారం చేసి హత్య చేసినట్లు నిర్దారణ అయిందన్నారు. ముగ్గురు నిందితులను రెండు రోజుల్లో పట్టుకొని అరెస్ట్ చేసి వారిపై హత్య, హత్యాచారం, ఎస్సీ, ఎస్టీ చట్టాల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నార్నూర్ సీఐ ప్రేమ్ కుమార్, ఇంద్రవెల్లి, ఉట్నూర్ ఎస్సైలు, సునీల్, భరత్ సుమన్ ఉన్నారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరు యువకుల దుర్మరణం

- పండుగపూట ఇరు కుటుంబాల్లో విషాదం

నవతెలంగాణ-కడెం

బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందిని సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సయ్యద్ సమీ(18), మొహమ్మద్ జియాన్(18) ఇద్దరు స్నేహితులు ద్విచక్ర వాహనంపై మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామానికి వెళుతున్న క్రమంలో మార్గం మధ్యలోని పెద్ద బెల్లాల్ గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొనగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను నిర్మల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సయ్యద్ సమీ మృతి చెందగా, మరొకరు జీహన్‌ను నిర్మల్ ఆస్పత్రికి తరలించి, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పండుగ పూట విషాదం...

బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మిత్రులిద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రమాదం జరుగడంతో ఇరుకుటుంబాల్లో విషాదం నెలకొంది. అప్పటి వరకు తమ మధ్య ప్రార్థనలు చేసి ఇలా దుర్మరణం చెందడంతో ఇరుకుటుంబాలతో పాటు స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.





అటవీ హక్కు చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-సిరికొండ

అటవీ హక్కు చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీజ అన్నారు. గురువారం మండలంలోని రాజంపేట్ గ్రామాన్ని సందర్శించి, ఎఫ్ఆర్సీ ప్రాజెక్ట్, సామూహిక అటవీ హక్కు చట్టంపై గిరిజనులకు అవగాహన కలిగించారు. సామూహిక అటవీ హక్కు కమిటీ సభ్యులు పూర్తి బాధ్యతను తీసుకొని, అడవిని రక్షించాలని, మొక్కలు పెంచాలని అన్నారు. అడవిని కాపాడే బాధ్యత కమిటిదేనని అన్నారు. కమిటీకి గ్రామస్తులు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామస్తులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పింఛన్లు, గ్రామానికి రోడ్డు సౌకర్యం కోసం అటవీ శాఖ అనుమతులు, మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీడీ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ విఠల్‌రావు, సీఎఫ్ఆర్ ప్రాజెక్ట్ మండల కోఆర్డినేటర్ టి.మహేందర్, సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్, గ్రామస్తులు నాగోరావ్, బందు పటేల్, రాము, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు : డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపడుతున్నామని, అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై వివరించారు. ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా నిరోధించడానికి డ్రై డే వంటి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించి వాటి బారిన పడకుండా చూస్తామని అన్నారు. ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అటు తనపై ఓ టీవీ ఛానెల్ నిరాధారమైన ఆరోపణలతో కథనం ప్రచారం చేయడం బాధాకరమని, న్యాయపరంగా ఎదుర్కొంటానని తెలిపారు.

ఎమ్మెల్యే తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో వైద్య చికిత్సల నిమిత్తం వచ్చే రోగుల సహాయకులకు భోజన వసతిని కల్పించి, వారికి అండగా నిలవడం అభినందనీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. రిమ్స్ ఆవరణలోని సత్యసాయి నిత్యాన్నదాన ట్రస్ట్ ద్వారా చేపట్టే అన్నదాన కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే తండ్రి జోగు ఆశన్న జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించారు. ముందుగా సత్యసాయి చిత్రపటం వద్ద ప్రత్యేక హారతులు అందచేసిన అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా రోగుల సహాయకులకు వడ్డించారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ గత పన్నెండు సంవత్సరాలుగా రోగుల సహాయకులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే వారికి ఈ సదుపాయం సాంత్వన ఇస్తోందని పేర్కొన్నారు. సత్యసాయి నిత్యాన్నదాన ట్రస్ట్ సభ్యులకు తమ వంతుగా పూర్తి సహకారం అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి సతీష్, రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా కుర్ర నరేష్

నవతెలంగాణ ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా కుర్ర నరేష్‌ను నియమించారు. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ టౌన్ ప్రెసిడెంట్ అజయ్, యూత్ ప్రెసిడెంట్ శివ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్, తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మకంటి రమేష్, తాలూకా గౌరవ అధ్యక్షులు, జక్కుల సత్యనారాయణ, తాలూకా ప్రధాన కార్యదర్శి చిలుక విలాస్, కో కన్వీనర్ మెంచూ అశన్న, కటకం మహేష్, ఎన్నం నందు, మెంచు అశోక్ పాల్గొన్నారు.

జనావాసాల్లోకి వచ్చిన మెఖం మృతి

నవతెలంగాణ-హాజీపూర్



అడవి నుండి జనవాసాల్లోకి వచ్చిన మెఖం మృతి చెందిన ఘటన మండలంలోని నంనుర్ పునరావాస కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పునరావాస కాలనీకి అనుకొని వున్న అడవీ ప్రాంతం నుండి మెఖం జనావాసాల్లోకి రావడంతో కుక్కలు వెంటపడి తరిమాయి. ముళ్ళ పొదల్లోకి చిక్కుకున్న మెఖం స్థానికులు కాపాడే ప్రయత్నం చేసేలోగా మృతి చెందింది. అడవీశాఖ అధికారులకు సమాచారం అందించామని తెలిపారు.

www.navatelangana.com

నవతెలంగాణ

మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

శుక్రవారం 30 జూన్ 2023

ఈపీ ఫిట్టర్ ఎలక్ట్రిషియన్ల కౌన్సెలింగ్ నిర్వహించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి యాజమాన్యం ఈపి ఫిట్టర్, ఈపీ ఎలక్ట్రియషన్ల కౌన్సెలింగ్‌లు వెంటనే నిర్వహించాలని గురువారం హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, సెంట్రల్ నాయకులు దుర్గం లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారికంగా వాయిదా వేయడాన్ని హెచ్ఎంఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం ఖచ్చితమైన తేదీని ప్రకటించాలని, లేదా దళారులు రంగ ప్రవేశం చేసి లంచాలు తీసుకొని తమ ఇష్ట రాజ్యాంగ వ్యవరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరుతూ బుధవారం డైరెక్టర్(పా) బలరాంకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి వెంటనే కౌన్సిలింగ్ నిర్వహించి దళారుల బెడదను నివారించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రానికి వస్తున్న ముఖ్యమంత్రి ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించే విధంగా వ్యవహరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు కోరారు. గురువారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడేను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వస్తున్న ముఖ్యమంత్రి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. 317 జీఓ ద్వారా అనేకమంది ఉపాధ్యాయులు స్థానికత కోల్పోవాల్సి వచ్చిందని వారిని తిరిగి సొంత జిల్లాలకు కేటాయించాలని కోరారు. నూతన పీఆర్సీ అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో కేర్ టేకర్లను నియమించాలన్నారు. నూతన జిల్లాలకు విద్యాధికారిని, మండలాలకు మండల విద్యాధికారి పోస్టులు మంజూరు చేయాలన్నారు. ఎంఆర్సిలలో పనిచేస్తున్న వారికి టైం స్కేల్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్, నాయకులు ఎనగంటి బిక్షపతి, పత్తిపాక శ్రవణ్, ఇందారపు ప్రకాష్, రేగళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం



నవతెలంగాణ-జన్నారం

మొక్కలే మానవ మనుగడకు జీవనాధారమని ప్రతి ఇంటి పరిసరాలల్లో మొక్కలు నాటి పచ్చదనంగా మారుద్దామని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, పొనకల్ సర్పంచ్ జక్కుల భూమేష్ అన్నారు. గురువారం తిమ్మాపూర్ గ్రామంలోని నర్సరీ, పొన్కల్ గ్రామంలోని నర్సరీలలో వేరువేరుగా ప్రతి ఇంటికి ఆరు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో సర్పంచులు ప్రతి ఇంటికి 6 మొక్కలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు, మొక్కలను నాటడమే కాదు, వాటికి నీరు పోసి పెంచి వృక్షాలుగా తయారు చేసినప్పుడే ఫలితం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడే శక్తి మొక్కలకు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఇండ్ల పరిసరాలలో మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ గ్రామ కార్యదర్శి లావణ్య, పొనకల్ ఈఓ మహేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గుడిరేవు గ్రామానికి చెందిన సంతపూరి యేసయ్య అనే వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతని కుమారుని మిత్రులు వినయ్ స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా వారికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మాట్లాడుతూ తమతోపాటు పదో తరగతి వరకు చదువుకున్న నలిమినేని పేరుమీద స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. దీంట్లో భాగంగానే తమ మిత్రునికి ఆర్థిక సహాయం అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూచన సంస్థ సభ్యులు పురెళ్ళ అభిలాష్, చటనోజు శశి, గొల్లపల్లి సురేష్, పుల్ల అన్వేష్ పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బెజ్జూర్

ఉరివేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కృష్ణపెల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణపెల్లి గ్రామానికి చెందిన చౌదరి జయరాం(48) తాగుడుకు బానిసై ఇంటిలో ఎవరు లేని సమయంలో ఇంటి వాసానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నానాభాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

సకాలంలో పెన్షన్లు చెల్లించాలి

కాగజ్‌నగర్ : వృద్ధులకు అసరా, దివ్యాంగులకు అందించే పెన్షన్లను సకాలంలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు జి పూర్ణచందర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిగ్నల్స్ లేవనే కారణంగా వీరికి సకాలంలో పెన్షన్లు ఇవ్వడం లేదని, దీనితో వీరు పెన్షన్ కేంద్రానికి ఆటోలలో వచ్చి సాయంత్రం వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. వారి ఇళ్ల వద్దే పెన్షన్లు ఇచ్చే విధంగా చూడాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి సీఎం హామీ ఇవ్వాలి

- ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి జిల్లాలోని నెలకొన్న సమస్యల పరిష్కారంపై సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని లేదంటే ఆయన పర్యటన అడ్డుకుంటామని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ హెచ్చరించారు. జిల్లా కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి అంటే సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, జిల్లా పార్టీ కార్యాలయం కాదని అనేక సమస్యలు పరిష్కారం కాకుండా మిగిలిపోయాయన్నారు. జిల్లాలో ప్రధాన సమస్యలైన గుండి వంతెన, కిరిడీ, ఇందని రోడ్డు, తిర్యాణి రోడ్డు, డబల్ బెడ్ రూం ఇళ్ల విషయంలో ఆసిఫాబాద్ ప్రజలను మోసం చేశారన్నారు. నిరుద్యోగ బృతి విషయంలో యూవకులను మోసం చేసారన్నారు. జోడేఘాట్‌లో ఆదివాసులకు 50 ఇండ్లు మంజూరు చేస్తే ఇప్పటికి వారికి బిల్లులు రాక 31 మంది బిల్లుల కోసం ఎదురుచేస్తున్నారన్నారు. జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల, జిల్లాలో ఆదివాసి యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కుంరంభీం ప్రాజెక్ట్, వట్టి వాగు ప్రాజెక్ట్, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్ట్‌లను మరమత్తులు చేసి జిల్లా రైతాంగానికి సాగు నీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు అడ ప్రాజెక్ట్ కట్ట తెగిపోగా నేటికీ ఆ కాలువకు మరమత్తులు చేయలేదని మల్లి ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభం అయిన కూడా మరమత్తులు చేయక, కాలువలు తవ్వకపోవడం ప్రాజెక్ట్ ప్రమాదంలో ఉందని వెంటనే ప్రాజెక్ట్‌లను మరమత్తులు చేసి రైతులకు సాగు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ జమీర్, తాజ్ బాబా, టేకం గంగారం, ఎస్కే అర్బస్, ఉమర్, పిప్పిరి సాయి, కోటేష్ పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలను పున: ప్రారంభించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి పాఠశాలలను సీబీఎస్ఈ సిలబస్‌తో పునఃప్రారంభించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజు అన్నారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎస్ఆర్ నిధులతో సింగరేణేతర ప్రాంతాల్లో కూడా అభివృద్ధి చేస్తున్న సింగరేణి యాజమాన్యం కొత్తగా వస్తున్న యువ కార్మికుల దృష్టిలో ఉంచుకొని వారి పిల్లల కోసం కోల్ బెల్ట్ ప్రాంతాల్లో గల నడుస్తున్న, మూసివేసిన సింగరేణి పాఠశాలలను సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టి పునః ప్రారంభించి సింగరేణి కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆదాయపన్ను రూపేనా సంవత్సరంలో మూడు నెలల జీతం కోల్పోతున్న కార్మికులు వారి పిల్లల విద్య కొరకై కార్పొరేట్ స్కూల్‌లలో చదివించడం వలన మరింతగా ఆర్థిక దోపిడీకి గురవుతున్నందున యాజమాన్యం కార్మికుల పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విద్యను అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. కార్మికుల పిల్లలకు సింగరేణి అనుబంధ యూనిట్లను స్థాపించి వాటి గురించి అవగాహన కల్పించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. అన్ని యూనియన్లను సమానంగా చూస్తామని లేబర్ కమిషన్ వద్ద చెప్పిన ప్రకారం అన్ని ఏరియాలకు వెంటనే రాతపూర్వకమైన ఆదేశాలు ఇవ్వాలని, మైన్స్ సేఫ్టీ కమిటీ సమావేశాలతో పాటు ఏరియా స్థాయిలో స్ట్రక్చర్ సమావేశాలకు అన్ని యూనియన్లను ఆహ్వానిస్తే అలాంటి సమావేశాల్లో కార్మిక సమస్యలతో పాటు సంక్షేమం విషయాలను సైతం యాజమాన్యం ముందు ఉంచడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, డివిజన్ నాయకులు కస్తూరి చంద్రశేఖర్, సుధాకర్, శ్రీనివాస్, భానేష్ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు కంటి తుడుపు చర్యే

- ఐదేళ్ల తర్వాత సీఎంకు జిల్లా గుర్తుకువచ్చిందా..?
- డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఐదేళ్ల తర్వాత జిల్లాకు వస్తున్న సీఎం కేసీఆర్ పోడు భూములకు పట్టాల పేరుతో కొత్త నాటకానికి తెర తీస్తున్నారని, ఇది కేవలం కంటి తుడుపు చర్య మాత్రమేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించారు. గురువారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2018, నవంబర్‌లో కాగజ్‌నగర్‌లో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న కేసీఆర్ మళ్లీ ఇపుడు జిల్లాకు వస్తున్నారని అన్నారు. ఎన్నికలు వస్తుండడంతోనే సీఎంకు ఈ జిల్లా గుర్తుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. 2014, 2018 ఎన్నికల ప్రచారంలో పోడు రైతులందరికీ పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చారని, ఇపుడు ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో పట్టాలు అందించిన రైతులకే ఇపుడు రైతుబంధు వర్తింపచేసేందుకే ఈ పట్టాల పేరుతో కొత్త డ్రామా ఆడుతున్నారని అన్నారు. సిర్పూరు పేపర్ మిల్లు కార్మికులు సుమారు 200 మందిని ఇప్పటికీ విధుల్లోకి తీసుకోలేదని, వీరిని విధుల్లోకి తీసుకునేలా స్థానిక ఎమ్మెల్యే సీఎం కేసీఆర్ మీద ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. శుక్రవారం జిల్లాకు వచ్చే సీఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు తమను అనుమతించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్వల్ప కాలిక్ విస్తారక్ స్వప్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సిందం శ్రీనివాస్, నాయకులు గోలెం వెంకటేష్, మాచర్ల శ్రీనివాస్, చేరాల శ్రీనివాస్, రాజేందర్‌జంజోడ్, ఎం అశోక్, రమేష్, నరేష్ పాల్గొన్నారు.

సర్దార్‌బస్తీలో సంపర్క్ అభియాన్

స్థానిక సర్దార్‌బస్తీలో మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఇంటింటికీ పార్టీ కరపత్రాలు పంపిణీ చేశారు. స్టిక్కర్లు అంటించారు. శక్తి కేంద్ర ఇన్‌ఛార్జి రాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుతో పాటు నాయకులు పాల్గొన్నారు.

ఏరియా వర్క్‌షాప్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆధునికరించిన ఏరియా వర్క్ షాప్ కార్యాలయాన్ని గురువారం ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ఏరియా వర్క్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగుల సౌకర్యార్థం మారుతున్న కాలానుగుణంగా వారి కార్యాలయాలను ఆధునీకరించడం జరుగుతుందని, అందులో భాగంగా ఏరియా వర్క్ షాప్ కార్యాలయాన్ని సుమారు రూ.15 లక్షలతో ఆధునీకరించడం జరిగిందని తెలిపారు. అలాగే ఏరియా వర్క్ షాప్‌లో ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పచ్చదనం పెంచాలని ఉద్యోగులు రక్షణ పరికరాలు ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులతో జీఎం మాట్లాడుతూ స్క్రాప్ (పనికిరాని ఇనుప వస్తువులు)తో నూతనంగా సంస్థకు ఉపయోగపడే యంత్రాలను తయారు చేయడం సంతోషకరమైన విషయమని, స్క్రాప్ (పనికిరాని ఇనుప వస్తువులు)తో నూతన ఫ్యాన్ యంత్రాన్ని తయారు చేసిన ఏరియా వర్క్ షాపు అధికారులను జనరల్ మేనేజర్ అభినందించారు. అలాగే గాలిమర(విండ్ మిల్) యంత్రాన్ని తయారు చేయడాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి మున్ముందు కూడా సంస్థకు ఉపయోగపడే ఇటువంటి యంత్రాలను తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ జి.రమేష్ బాబు, డీజీఎం వర్క్‌షాప్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం సివిల్ శివరావు, పీట్ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పోడు పట్టాల పంపిణీ ఒక చరిత్ర

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన ఆదివాసులకు పోడుపట్టాల పంపిణీ ఒక చరిత్ర అని రాష్ట్ర అటవీ, దేవదాయ, న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల దీర్ఘకాలిక కోరికను ముఖ్యమంత్రి నెరవేర్చారని, పోడు పట్టాల పంపిణీ తెలంగాణలో ఒక చరిత్ర అని కొనియాడారు. గిరిజనుల దీర్ఘకాలిక కోరిక తీరుస్తున్న ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయడం వారి కర్తవ్యం అన్నారు. జిల్లాలో గిరిజనులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఎమ్మెల్సీ దండే విఠల్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆధ్వర్యంలో కొనసాగుతున్న పర్యటన పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ తెలంగాణ గాయకుడు సాయి చందు మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగడంతో పాటు, ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతున్నట్లు, వారికి అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు.

గోలేటి సీహెచ్‌పీలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని గురువారం జీఎం జి.దేవేందర్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా సీహెచ్‌పీ సమీపంలో ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. గోలేటి సీహెచ్‌పీని స్వచ్ఛతలో నిలిపి అవార్డు అందుకున్నందుకు అధికారులు, ఉద్యోగులను ప్రశంసించారు. మొక్కల సంరక్షణలో సీహెచ్‌పీ ఉద్యోగులు ముందున్నారన్నారు. ప్రతి ఉద్యోగి కనీసం ఐదు మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మర్రాజ్ శ్రీనివాస్‌రావు, ఏజీఎం తిరుమలరావు, డీజీఎం(ఈఅండ్ఎం) సీహెచ్ జాడె భీంరావు, రాజు(ఈఈ), ఫిట్ కార్యదర్శి నేరుగు రమేష్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏజెంట్‌కు సన్మానం



నవతెలంగాణ-కాసిపేట

పదోన్నతిపై ఆర్జీ-3 ఓసీ-2 ప్రాజెక్టు ఆఫీసర్‌గా బదిలీపై వెళ్తున్న కాసిపేట గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్‌ను గురువారం కాసిపేట-2 గని కార్మికులు, అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఏరియా సెఫ్టీ ఆఫీసర్ రవిందర్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏరియా సెక్రటరీ వోడ్నాల రాజన్న, ఫీట్ సెక్రటరీ కారుకురి తిరుపతి మాట్లాడుతూ మృదుస్వభావి, కాసిపేట గ్రూప్‌కి అందించిన తన సేవలు మరువలేనవని కొనియాడారు. కాసిపేట-2 గని కోత్తగా మొదలైనప్పుడు నీళ్ళు లేక, అటు ఇంటర్నెల్ రోడ్డు లేక, కార్మికులు కూర్చుని తినడానికి గద్దెలు లేవు, మైసమ్మ ఆలయం లేదు ఇలా ఏది అందుబాటులో లేని సమయంలో 5 సంవత్సరాలు కాసిపేట గ్రూప్‌కి రాజేందర్ సర్ ఏజెంట్‌గా చేసిన తరుణంలో కోత్త గనికి కోత్త రూపాన్ని అందించారు. ఆయన ఇక్కడ ఎలాగైతే మంచిపేరు తెచ్చుకున్నరో ఆర్జీ-3 ఏరియా ఓసి-2లో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెఫ్టీ ఆఫీసర్ సంతోష్‌రావు, ఇంజనీర్ రఘు, వేల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, టీబీజీకేఎస్ ఏరియా సెక్రటరీ వోడ్నాల రాజన్న, కాసిపేట-2 గని టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ కారుకురి తిరుపతి, వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్ సెగ్గం శ్రీనివాస్, సెఫ్టీ అండ్ మైన్స్ కమిటీ మెంబర్‌లు రాజేందర్, కోత్తపల్లి ఉదయ్, గణపతి తిరుపతి పాల్గొన్నారు.

ఎస్పీఎం కార్మికుల సమస్యను సీఎం దృష్టికి తీసుకుపోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు కార్మికుల సమస్యను స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంబాల ఓదేలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2018లో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఈ మిల్లు పున:ప్రారంభమైందని, కాని నేటికీ సుమారు 200 మంది కార్మికులను యాజమాన్యం విధుల్లోకి తీసుకోలేదని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో మిల్లు కాంట్రాక్టు కార్మికులకు రూ.35 వేలు ఇప్పిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదని పేర్కొన్నారు. వీటన్నింటిని సీఎం దృష్టికి తీసుకపోయి పరిష్కరించాల్సిన బాధ్యత ఎమ్మెల్యే కోనప్పపై ఉందని అన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలో గురువారం తొలి ఏకాదశి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని రంగనాయక, శివాలయం, వీరహనుమాన్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో ఉదయం నుండి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల తాకిడితో ఆలయాలు కిటకిటలాడాయి.

సీఐగా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ నూతన సీఐగా జి.రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సీఐగా బాధ్యతలను స్వీకరించడంతో ఎస్సై భరత్, పోలీసు సిబ్బంది సీఐకి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ పని చేసిన సీఐ సైదారావు అదిలాబాద్ రూరల్‌కి బదిలీ కాగా, జైనూర్ సీఐ పనిచేసిన రామకృష్ణ బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.



ఇంటింటికీ బీజేపీ ప్రచారం

అదిలాబాద్ రూరల్ : ఇంటింటికీ బీజేపీ ప్రచారంలో భాగంగా గురువారం దుబ్బగూడ, వాఘాపూర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ మాట్లాడుతూ బీజేపీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని అన్నారు. బీజేపీ హయాంలో దేశం అభివృద్ధి చెందుతోందని అన్నారు. రాష్ట్రంలో కూడా అభివృద్ధి జరగాలంటే ఒక్క సారి అవకాశం ఇవ్వాలని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి కోరలు చాచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు. రవిరెడ్డి, రఘుపతి, సతీష్, నాందేవ్, వినోద్, రాజు, చిలుకూరి జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, గంగారెడ్డి, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన బక్రీద్ వేడుకలు ముస్లిం సోదరులు జిల్లా కేంద్రంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని మసీదులలో ముస్లింలు సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొహమ్మద్ ప్రవక్త చూపించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఇమామ్‌లు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక బక్రీద్ అని తెలిపారు. మైనారిటీలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సింగిల్ విండో చైర్మన్ అలి బిన్ అహ్మద్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : పట్టణంలోని ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం బక్రీద్ పండగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని స్థానిక పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్నటువంటి ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఆజీజ్ మాట్లాడుతూ త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ పండుగను బీద, ధనిక అనే తేడా లేకుండా అందరూ భక్తిశ్రద్ధలతో సుఖ సంతోషాలతో పండుగను జరుపుకోవాలనీ కోరారు. నమాజ్ అనంతరం ఒకరి ఒకరు అలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి ఏరియా బ్రాంచ్ సెక్రటరీ అక్బర్‌అలీ, డా.సలీం, ఖాజాషరీఫ్, పాషా, మేరాజ్, తహర్, సాదిక్, ఆరీఫ్, గౌస్, ఖలీం, జమీర్, తాజ్, రుస్తుమ్ అలీ, జబ్బర్, అన్ని మసీదుల ఇమాములు, మత పెద్దలు, ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జన్నారం : మండలంలో ముస్లిం సోదరులు గురువారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పవిత్ర స్థానాలు ఆచరించి, మండలంలోని ధర్మారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులు రజాక్, పసివుల్లా, ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొని ఒకరికొకరు అలాయి బలాయి తీసుకున్నారు. ఈ బక్రీద్ పండుగ వేడుకలలో మండల కోఆప్షన్ సభ్యులు అలీ ఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్, హజారుద్దీన్, ముజ్జు, మౌలానా పాల్గొన్నారు.


ఆసిఫాబాద్

వాంకిడి : బుధవారం మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కూడా ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో గల ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సిర్పూర్(టి) : బక్రీద్ పండుగను పురస్కరించుకొని మండలంలోని ముస్లింలు ఈద్గా, మసీదుల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం మత పెద్ద ఖురాన్‌లో ఉన్న వ్యాక్యాలను చదివి వినిపించారు.


రామకృష్ణాపూర్


జన్నారం


సిర్పూర్(టి)

ప్రతి అధికారి అందుబాటులో ఉండాలి

● ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రానికి వస్తున్న సీఎం కేసీఆర్ పర్యటనలో ప్రతి అధికారి అందుబాటులో ఉండాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కాడే హేమంత్ ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో పర్యటనకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో కేటాయించిన అన్ని శాఖల అధికారులు ఉదయం 9:45 వరకు కలెక్టర్ కార్యాలయం వరకు రావాలని ఆదేశించారు. ప్రతి అధికారి తమకు కేటాయించిన గదులలో ఉండాలని విధిగా పాస్ కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రత కట్టుదిట్టంగా ఉండడంతో అధికారులు ఇచ్చిన సమయానికి అంత ముందుగా ఆయా స్థలాల చేరుకోవాలని సూచించారు. అధికారులకు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం, ఆర్డీఓ రాజేశ్వర్, జిల్లాలోని అన్ని శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఆదిలాబాద్‌లోని మాధవ సేవా సమితి కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు సునీల్ చౌహాన్ మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా పదోన్నతులు, 5 సంవత్సరాలుగా బదిలీలు లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర నిరాశతో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు కేసులు పేరుతో ప్రభుత్వం తాత్సారం చేయడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులకై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయొద్దని కోరారు. ఉపాధ్యాయుల పెండింగులో ఉన్న బిల్లులు అన్ని త్వరగా చెల్లించాలి అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపీకృష్ణ, ఆర్థిక కార్యదర్శి బచ్చు నారాయణ, ఉపాధ్యక్షులు మెట్పల్లి గోపాలకృష్ణ, మెస్రం రాజ్‌కూమర్, సహా అధ్యక్షులు గోమంత్‌రెడ్డి, శంకర్ రెడ్డి, గోపాల్, సంతోష్, సురేష్ పాల్గొన్నారు.

సాయి చందు హఠాన్మరణం తీరని లోటు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మలిదశ ఉద్యమకారుడు తెలంగాణ గాయకుడు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చందు హఠాన్మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటని రాష్ట్ర అటవీ దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గానం ద్వారా తెలంగాణ ఉద్యమానికి ఊపు తెచ్చిన గొప్ప వ్యక్తి సాయిచందు అని కొనియాడారు. మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, జడ్పీటీసీలు అరిగేల నాగేశ్వరరావు, కోవ అరుణ పాల్గొన్నారు.

వాంకిడి : తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమ కళాకారుడు, సాంస్కృతిక కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ సాయిచందు అకాల మరణం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని జడ్పీటీసీ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బహిరంగ సభలో ఆయన తన పాటలతో అలరించేవాడని గుర్తు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కమలాకర్, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జన్నారం : తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాటలతో ఉర్రూతలూగించి, యావత్ తెలంగాణ జాతిని మేల్కొల్పిన తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచందు గుండెపోటుతో మరణించడం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని మండల ఆదర్శ కళా సమితి అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగు, అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. అతను అమ్మపై పాడిన పాటను సాంస్కృతిక కళాకారుడు లావుడియా రమేష్ పాడి అతనికి, అంకితం ఇచ్చారు, రెండు నిమిషాల మౌనం పాటించారు. కళాకారులు రమేష్, నరేష్ పాల్గొన్నారు.

నిర్మల్ : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ హఠాన్మరణం పట్ల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సాయిచంద్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని, ఆయన ఆత్మకు శాంతి చేకురాలని కోరారు.

ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మెన్ సాయిచంద్ ఆకస్మిక మరణం బాధాకరమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విజ్జగిరి నారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములమయ్యామని తెలిపారు. తన పాటలతో ప్రజల్లో .చైతన్యం కల్పించారని తెలిపారు. ఆయన మరణం ఆయన కుటుంబంతో పాటు దళిత జాతికి, తెలంగాణ రాష్ట్రానికి తీరనిలోటు పేర్కొన్నారు. సాయిచంద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.


జన్నారం

భక్తి శ్రద్ధలతో ఏకాదశి ఉత్సవం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏకాదశి ఉత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని దనోర(బి), శంకర్‌గూడ తదితర గ్రామాల్లో భక్తులు విఠలేశ్వరుని నామస్మరణతో వీదులగుండా మహిళలు నెత్తి మీద కలశాన్ని పెట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలోని తొలి ఏకాదశి నాడు మహారాష్ట్ర సొలాపూర్ జిల్లాలోని పండరిపూరిలో కొలువు దీరిన విఠలేశ్వరుని ఆలయానికి భక్తులు తండోప తండాలుగా తరలి వెళ్లారు. ఈ రోజున ఏకాదశి కావడంతో దినమంతా ఉపవాస దీక్షలు చేపట్టి భక్తులు భజనలు, సంకీర్తనలో మునిగిపోయారు.

తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్‌టౌన్ : ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని ప్రముఖ ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఈ సంవత్సరంలో వచ్చే 24 ఏకదశుల్లో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం నుండే భక్తుల సందడి నెలకొంది. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ఉపవాస దీక్షలను పాటించారు. తొలి ఏకాదశి పండగను పురస్కరించుకుని స్థానిక మార్వాడి ధర్మశాల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే జోగు రామన్న దర్శించుకున్నారు. స్వామివారిని ప్రత్యేక హారతులతో కొలిచిన అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి కృపా కటాక్షలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్ ప్రకాష్, బండారి దేవన్న పాల్గొన్నారు.

రాంనగర్‌లో..

హిందువులు అత్యంత పవిత్రంగా భావించే ఆషాడ ఏకాదశి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలోని రుక్మిణి విఠల్ దేవాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట జిల్లా నాయకులు రఘుపతి, ధోని జ్యోతి, చిలుకూరి జ్యోతిరెడ్డి, స్వామిరెడ్డి, భీమ్‌సేన్‌రెడ్డి, సాయి, శివ, గోపి ఉన్నారు.

'చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం చేయండి'



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని దుర్గాపూర్ గ్రామంలోని ఓ నిరుపేద కుటుంబానికి అనుకోని ఆపద వచ్చింది. నానవేని రవి-సౌజన్య దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో పెద్ద కుమార్తె రిషిత గత కొంతకాలంగా ఆంక్యోస్ అనేమియా వ్యాధితో బాధపడుతోంది. ఈ వ్యాధికి గురైన పాప శరీరంలో ఎదుగుదల లేక రక్తహీనతతో మరింత బాధపడుతుందని తల్లిదండ్రులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు సంవత్సరాల నుండి ఎన్నో ఆస్పత్రులు తిరిగి పాప ఆరోగ్యంలో ఎలాంటి మార్పు రాకపోవడంతో చివరికి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి డాక్టర్లు పాప చికిత్సకు దాదాపు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని కుటుంబసభ్యులకు తెలిపారు. అసలే రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్న తల్లిదండ్రులు మేము ఇంత ఖర్చు ఎలా భరించగలమని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. మా బాధలను అర్థం చేసుకొని దాతలు ఎవరైన ముందుకొచ్చి సాయం చేయాలని పాప తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. సాయం చేసే వారు 8790372570 నెంబర్‌ను సంప్రదించాలని, ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా తోచిన ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.

కేసీఆర్‌ను గద్దె దించాలి

● కాసిపేటలో మహాజన్ సంపర్క్ అభియాన్

నవతెలంగాణ-కాసిపేట

తెలంగాణ రాష్ట్రంలో బలహీన వర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలు, యువకులు, నిరుద్యోగులు, ఉద్యోగులూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కేసీఆర్‌ను రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి గద్దె దించాలని బీజేపీ బెల్లంపెల్లి నియోజకవర్గ నాయకుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ మహా జన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన కాసిపేట్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల్ని నమ్మించి మోసం చేసిన విధానాలను ఎండగట్టారు. రకరకాల 'బంధు'ల పేరుతో అన్ని బంద్ పెట్టీ అందర్నీ మోసం చేసిన కేసీఆర్‌కు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. బీసీ బంధు పేరుతో మోసం చేయడానికి ప్రణాళిక రచించినట్లు, ఆయన మోసాల పట్ల బీసీలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అమాయక బలహీన వర్గాలకు గొర్రెలు, బర్రెలు ఇస్తామని ఓట్లు వేయించుకొని మోసం చేశాడని తెలిపారు. వారి ఓట్లతో గద్దెనెక్కిన కేసీఆర్ వారిని మళ్ళీ మోసం చేయడానికి జిమ్మిక్కులు చేస్తున్నారని, వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని యువకులను మోసం చేశాడని గుర్తు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను, స్థానిక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను చిత్తుగా ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గోవర్ధన్, మండల అధ్యక్షుడు అత్కపురం రమేష్, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, ఓబీసీ మోర్చ మండల అధ్యక్షుడు పెద్దపల్లి శంకర్, పులబోయిన పోషం, రాజమ్మ, బీజేవైఎం మండల అధ్యక్షులు, ఐటీ సెల్ కన్వీనర్ అరవింద్, శ్రావణ్ కుమార్, నర్సింగ్, నవీన్ కుమార్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.